
నవతరం
RNI NO. APTEL/2014/58326
తెలుగు దినపత్రిక
సంపుటి : -13 సంచిక : 68 ఎడిషన్ ఇన్‌ఛార్జ్ : నవచైతన్య శిరిగిరి
శ్రీకాకుళం, విజయనగరం, విశాఖపట్నం రాజమండ్రి
30-12-2025 మంగళవారం వెల : 1/- పేజీలు : 4

# రాజకీయ పార్టీలకు కళింగుల హెచ్చరికా..?



- శ్రీకాకుళం ఎంపీ బరిలో ఈసారి కళింగులేనా?
- ఒక్క తాటిపైకి వచ్చిన కళింగ సామాజిక వర్గం
- ఎచ్చెర్ల ఆత్మీయ సమావేశం వెనుక వ్యూహాలా?
- పార్టీలకు తామే షరతులు విధిస్తామన్న సంకేతాలా?
- ఎన్నడూ లేనంతగా పోటెత్తిన కళింగసామాజిక వర్గ ప్రతినిధులు







(నవతరం ప్రతినిధి శ్రీకాకుళం)

సంఖ్యాబలం ఉన్నా రాజకీయంగా మాత్రం ఎప్పటికీ పక్కనబెట్టబడిన సామాజికవర్గం ఏదంటే అది కళింగ సామాజికవర్గమే. ఎన్నికల వేళ స్టేజ్‌లపై పొగడ్తలు, ఓట్ల లెక్కల్లో వాడకం గెలుపు తర్వాత మాత్రం నిర్లక్ష్యం. ఇది శ్రీకాకుళం రాజకీయ చరిత్రలో పదే పదే కనిపిస్తున్న దృశ్యం.అయితే ఈ సారి మాత్రం ఆ దృశ్యం మారుతున్న సంకేతాలు ఎచ్చెర్ల వేదికగా కనిపించాయి. కళింగ సామాజికవర్గాన్ని ఒక్క తాటిపైకి తెచ్చే లక్ష్యంతో నిర్వహించిన ఆత్మీయ సమావేశం సాధారణ సమావేశంగా మిగలలేదు. అది రాజకీయ పార్టీలకు ఒక హెచ్చరికగా, ఒక పరీక్షగా మారింది.“సంఖ్య ఉంది కానీ ఐక్యత లేదు” అన్న మాటను ఇప్పటివరకు కళింగుల మీద ఆయుధంగా వాడిన రాజకీయ పార్టీలకు, ఈ సమావేశం గట్టి కౌంటర్ ఇచ్చింది. జాతి మొత్తాన్ని ఒకే స్వరంలో మాట్లాడించే ప్రయత్నం సక్సెస్ కావడం, ఇకపై రాజకీయ లెక్కలు మారబోతున్నాయన్న సంకేతాన్ని స్పష్టంగా ఇచ్చింది.గతంలో వైసీపీ సహా అన్ని పార్టీలూ కళింగ సామాజికవర్గాన్ని ఓటుబ్యాంక్‌గా మాత్రమే చూశాయి. అవకాశాలు ఇచ్చామని చెప్పుకున్నారు కానీ ఫలితాల్లో మాత్రం ఆ వర్గం ఆశలు నెరవేరలేదు. కారణం స్పష్టంఐక్యత లోపం. అదే లోపాన్ని రాజకీయ నాయకులు తమకు అనుకూలంగా మలుచుకున్నారు.ఈ సమావేశంలో దువ్వాడ శ్రీనివాస్‌కు దక్కిన ఆదరణ యాదృచ్ఛికం కాదు. ఆయన చుట్టూ కనిపించిన యువత, సెల్ఫీల కోసం ఏర్పడిన సందడి ఇవన్నీ ఒక సంకేతం. నాయకత్వం కోసం కళింగ సామాజికవర్గం ఎదురుచూస్తోందా? లేక కొత్త ప్రత్యామ్నాయాన్ని తయారు చేసుకుంటోందా? అన్న ప్రశ్నలకు ఇది సమాధానమా అన్న చర్చ మొదలైంది.శ్రీకాకుళం ఎంపీ స్థానం కళింగ సామాజికవర్గానికి దక్కాలన్న డిమాండ్ కొత్తది కాదు. కానీ ప్రతిసారి ఆ పదవి ఇతరుల చేతికి జారిపోతున్న వాస్తవం చేదు నిజం. ఐక్యత లేకపోవడమే ఇందుకు ప్రధాన కారణమన్న విషయం తెలిసినా, దాన్ని మార్చుకునే ప్రయత్నం ఇప్పటివరకు జరగలేదు. ఎచ్చెర్ల సమావేశం ఆ లోటును పూడ్చే మొదటి అడుగుగా కనిపిస్తోంది.ఈ ఐక్యత పార్టీలకు అసౌకర్యాన్ని కలిగిస్తోందన్నది వాస్తవం. ఇటీవల వైసీపీ జిల్లా అధ్యక్షుడు కృష్ణదాస్ చేసిన వ్యాఖ్యలు, దానిపై వచ్చిన నిరసనలు, తరువాత విడుదల చేసిన వివరణ ఇవన్నీ ఈ సామాజికవర్గం రాజకీయంగా కదులుతోందన్న సంకేతాలుగానే చూడాలి. సీనియర్ నాయకుడు తమ్మినేనికి తగిన గౌరవం ఇవ్వాలన్న మాటలు కూడా ఈ సందర్భంలో ప్రాధాన్యం సంతరించుకున్నాయి.ఇప్పుడు ప్రశ్న ఒక్కటేపార్టీలు అభ్యర్థులను నిర్ణయిస్తాయా?లేదా కళింగ సామాజికవర్గమే తన అభ్యర్థిని ఖరారు చేస్తుందా?ఈ ఐక్యత ఎన్నికల వరకు నిలుస్తే, శ్రీకాకుళం రాజకీయ పటం పూర్తిగా మారే అవకాశం ఉంది. కానీ గతంలా అంతర్గత విభేదాలు, వ్యూహాల పేరుతో చీలికలు వస్తే మళ్లీ అదే కథ పునరావృతమవుతుంది.రాజకీయం అంటే వ్యూహాలే.

కానీ ఈసారి ఆ వ్యూహం కళింగుల చేతుల్లో ఉంటుందాలేదా పార్టీల చేతుల్లోనే మిగిలిపోతుందా?అన్నదే ఇప్పుడు జిల్లావ్యాప్తంగా సాగుతున్న అసలు చర్చ.

## కవి, జర్నలిస్ట్ ధర్మారావుకు 'శ్రమ' అవార్డు



ప్రజా గీతాలు ఆలపిస్తున్న ధర్మారావు

(నవతరం -శ్రీకాకుళం

సిఐటియు అఖిలభారత మహాసభల నేపథ్యంలో, విశాఖపట్నం ఏయూ ఆవరణలో ప్రారంభమైన శ్రామిక ఉత్సవాల్లో ఆదివారం ఉదయం ప్రముఖ కవీ, జర్నలిస్ట్ నల్లి ధర్మారావు కు ‘ శ్రమ ‘ అవార్డును ప్రధానం చేశారు. శతాధిక కవులు, రచయితల శ్రమగానం పేరుతో, శనివారం ఈ ఉత్సవాలు ప్రారంభమయ్యాయి. తొలి రోజు సీనియర్ సంపాదకులు, సామాజిక, రాజకీయ విశ్లేషకులు, సాహితీవేత్త తెలకపల్లి రవికి తొలి అవార్డును అందించారు. రెండో రోజు నల్లి ధర్మారావుకు, కళింగాంధ్రకు చెందిన మరో ప్రముఖ కవి గంటేడ గౌరు నాయుడుకు ప్రకటించారు. ఇద్దరూ కళింగాంధ్రకు సుపరిచితులే!

-మిగతా 3లో



## వైకుంఠ ఏకాదశి సందర్భంగా భక్తులకు సులభతర దర్శనం కల్పించాలి

జిల్లా అధికారులకు రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు ఆదేశాలు

3లో



ఎడిటోరియల్

# ఆయుధీకరణకు అమెరికా సాకులు!

మిలిటరీ అవసరాలకు గాను ప్రపంచంలో పద్నాలుగు దేశాల వద్ద మొత్తం 51 విమానవాహక, హెలికాప్టర్ వాహక నౌకలు ఉన్నాయి. వాటిలో ఒక్క అమెరికా నౌకా దళంలోనే 20 ఉన్నాయి. అలాంటి మిలిటరీ శక్తి రక్షణ శాఖ పెంటగన్ మంగళవారం నాడు విడుదల చేసిన వార్షిక నివేదికలో చైనా గురించి గుండెలు బాదుకుంది, అధారాలు లేని ఆరోపణలు చేసింది. అవేమిటంటే రానున్న పదేండ్లలో మరో ఆరు విమానవాహక యుద్ధనౌకల నిర్మాణానికి చైనా పూనుకుంది. మంగోలియా సరిహద్దులో మరో మూడు భూగర్భ ఖండాంతర క్షిపణుల కేంద్రాలను ఏర్పాటు చేసి మరో వంద క్షిపణులను మోహరించేందుకు పూనుకుందని ఆరోపించింది. పనిలో పనిగా భారత్ %-% చైనా మధ్య తంపులు పెట్టేందుకు, అనుమానాలను పెంచేందుకు అరుణాచల్‌ప్రదేశ్ గురించి కూడా ప్రస్తావించింది. ఇదంతా ఎందుకు అంటే యావత్ ప్రపంచాన్ని బెదిరించేందుకు తమ మిలిటరీ శక్తితో పూనుకున్న యాంకీలు మరింతగా పెంచుకొనేందుకు ఇతర దేశాల మీద సాకులకు పూనుకన్నారు. ఇప్పటికే బలమైన నౌకాదళం ఉన్న చైనా చర్యలతో అమెరికా భద్రతకు ముప్పు వచ్చిందంటూ అమెరికన్లనూ భయపెట్టేందుకు పూనుకుంది.

'మాఇంటికి మీ ఇల్లు ఎంతదూరమో మీ ఇంటికి మాఇల్లు కూడా అంతే దూరం' అన్నట్లుగా అమెరికా యుద్ధ నౌకలు కూడా చైనాకు ముప్పే కదా! అమెరికా వద్ద 11 విమాన వాహక యుద్ధనౌకలుండగా చైనా 3, భారత్, బ్రిటన్, ఇటలీ రెండేసి చొప్పున, ఫ్రాన్సు, రష్యా ఒక్కొక్కటి కలిగి ఉన్నాయి. మొత్తం 22 విమాన వాహక నౌకల్లో సగం అమెరికా వద్ద ఉన్నాయంటే సప్త సముద్రాల్లోనూ ఒకటికంటే ఎక్కువ మోహరించి యావత్ ప్రపంచం మీద అమెరికా దాడి చేసేందుకు సన్నాహాలు చేసుకున్నట్లే భావించాలి మరి. పరస్పరం ఏ దేశమూ మరోదాన్ని నమ్మే స్థితిలేనపుడు, ఎవరినీ నియంత్రించే శక్తి ఐరాసకు లేదని తేలిపోయినందున ఎవరి జాగ్రత్తలో వారుండటం తప్పేమీ కాదు. అందుకే మనదేశం అణ్వస్త్రవ్యాప్తి నిరోధక ఒప్పందం(ఎన్‌పిటి) మీద సంతకం చేయలేదు, ఈ వైఖరిని అందరం సమర్ధిస్తున్నాం. క్వాడ్ పేరుతో అమెరికా, జపాన్, భారత్, ఆస్ట్రేలియా కూటమి కట్టాయి, ఆస్ట్రేలియా, బ్రిటన్, అమెరికా (అకుస్) పేరుతో మరో కూటమి ఉంది. ఇవన్నీ నాటో మాదిరి మిలిటరీ కూటములు కాకపోయినా స్వేచ్ఛాయుత నౌకా రవాణా, భద్రతా అంశాల సంప్రదింపులు మరొక పేరుతో తమను లక్ష్యంగా చేసుకున్నవే అని చైనా అనుమానిస్తున్నది.అందుకే పెంటగన్ నివేదికలో ఆరోపించినట్లుగా ఆరు విమానవాహక యుద్ధ నౌకలను నిర్మిస్తున్నదీ లేనిదీ స్పష్టంగా చెప్పకుండా అలాంటి పథకాలు తమ జాతీయ భద్రత అవసరాలకు అనుగుణంగా ఉంటాయని అమెరికాలో చైనా రాయబారి లీ పెంగ్‌యు వ్యాఖ్యానించాడు. తెలివితేటలు ఏ ఒక్కరిసొత్తూ కాదు, ఎవరి దౌత్యం వారిది. తిరుగుబాటు రాష్ట్రమైన తైవాన్ ప్రాంతం చైనాలో అంతర్భాగమని అన్ని దేశాలూ ఐరాసలో గుర్తించాయి. కానీ దాన్ని విలీనం చేసుకుంటామని బీజింగ్ చెబుతుంటే అవసరమైతే మిలిటరీని దించి అడ్డుకుంటామని అమెరికా, జపాన్ బెదిరిస్తున్నాయి. ఒకవేళ పాక్ ఆక్రమిత కాశ్మీరును స్వాధీనం చేసుకుంటామని మనదేశం చెప్పినా ఈ దేశాలు పాకిస్తాన్‌కే వత్తాసు పలుకుతాయన్నది స్పష్టం. రెండవ ప్రపంచయుద్ధంలో విడదీసిన ఉత్తర, దక్షిణ వియత్నాంలు ఒకటౌతామంటే జపాన్, ఫ్రాన్సు, అమెరికా మూడూ కూడా దాదాపు మూడు దశాబ్దాల పాటు ఉత్తర వియత్నాం మీద అమానుషదాడులు చేసిన సంగతి తెలిసిందే.

ఇప్పటికీ ఉత్తర-దక్షిణ కొరియాల విలీనానికి అడ్డుపడుతున్నది ఎవరంటే ఈ దేశాలే. దక్షిణ కొరియా, జపాన్‌లలో అమెరికా పెద్ద సైనిక స్థావరాలను కలిగి ఉంది. ఏమిటంటే ఆ దేశాల రక్షణతో పాటు తమ భద్రతకు అని చెబుతున్నది. బంగ్లాదేశ్ విముక్తి ఉద్యమం సందర్భంగా మనదేశం అక్కడి పౌరులకు మద్దతుగా సైన్యాన్ని పంపితే మనలను బెదిరించేందుకు అమెరికా తన సప్తమ నౌకాదళాన్ని బంగాళా ఖాతంలోకి రప్పించిన సంగతి మనం మరువగలమా? మనకు మద్దతుగా సోవియట్ రంగంలోకి దిగటంతో అమెరికా తోకముడిచింది. మూడు విమానవాహక యుద్ధనౌకలు, 370 ఇతర యుద్ధ నౌకలతో చైనా నేడు ప్రపంచంలో ప్రపంచంలో పెద్ద నౌకాదళం కలిగిన దేశంగా అవతరించింది. ఒక దేశం మిలిటరీ సత్తాను కొలిచేందుకు ఎన్ని విమానవాహక యుద్ధ నౌకలున్నాయన్నది ఒక కొలమానంగా చూస్తున్నారు. అటువంటపుడు చైనా నిజంగా పదేండ్లలో ఆరు నౌకలను నిర్మిస్తుందో లేదో తెలియదు గానీ సమకూర్చుకొనే హక్కు దానికి ఉంది, అప్పుడే అమెరికా అదుపులో ఉంటుంది.

# కళింగుల ప్రేమే నా శక్తి -దువ్వాడ శ్రీనివాస్

**- కళింగ ఆత్మీయ సమావేశంలో లభించిన అపూర్వమైన ప్రేమకు ఎమ్మెల్సీ**
**- కులాలకు అతీతంగా ప్రతి సామాజిక వర్గం కోసం పోరాడుతానని ఆయన స్పష్టం చేశారు**

**నవతరం టెక్కలి**



ఇటీవల శ్రీకాకుళం జిల్లా పరిధిలో జరిగిన కళింగ ఆత్మీయ సమావేశానికి హాజరైన ఎమ్మెల్సీ దువ్వాడ శ్రీనివాస్ తనకు లభించిన అపూర్వమైన ఆదరణకు కృతజ్ఞతలు తెలిపారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, "నా జీవితంలోనే కాదు నా ప్రజాసేవ ప్రయాణంలో కూడా ఎప్పటికీ చెరిగిపోని జ్ఞాపకం ఇది. వందలాది కళింగ సోదరులు నన్ను భుజాలపై మోసుకుంటూ వేదిక వరకు తీసుకువచ్చిన ఆ క్షణాలు నా హృదయాన్ని కదిలించాయి. అది గౌరవం కాదు ఒక కుటుంబం ఇచ్చిన అపారమైన ప్రేమ" అని అన్నారు.ఆ ప్రేమ తనపై మరింత బాధ్యతను పెంచిందని పేర్కొన్న ఆయన, "నా పోరాటం ఒక్క కులానికి పరిమితం కాదు. కాపులు, ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీలతో పాటు జిల్లాలోని ప్రతి సామాజిక వర్గం నా ఆలోచనలో ఉంది. ఎక్కడ అన్యాయం జరిగినా, ఎవరు బాధపడినా కులం, పక్షం చూడకుండా వారి తరఫున నిలబడతాను" అని స్పష్టం చేశారు.ప్రజలు తనను గౌరవించడమే కాకుండా తమవాడిగా భావించడం తనకు లభించిన అతి పెద్ద బహుమతి అని పేర్కొన్న దువ్వాడ శ్రీనివాస్, ఈ అపారమైన ప్రేమకు కళింగ సమాజానికి మాత్రమే కాకుండా శ్రీకాకుళం జిల్లాలోని ప్రతి సోదరుడు, సోదరికి హృదయపూర్వక కృతజ్ఞతలు తెలిపారు."మీ నమ్మకమే నా బలం, మీ భరోసానే నా బాధ్యత" అని ఆయన అన్నారు.

# ఉత్తర ద్వారం దర్శనం మానవాళికి మోక్షప్రదం



"వైకుంఠ ఏకాదశి " అనే పేరులో వైకుంఠ ఏకాదశి అని రెండు అర్థాలున్నాయి. వైకుంఠ శబ్దం ఇది విష్ణువును, విష్ణువు ఉండే స్థానాన్ని సూచిస్తుంది. చాక్షుస మనవంతరములు వైకుంఠ అనే ఆమె నుండి అవతరించినందున విష్ణువు వైకుంఠుడు అయ్యాడు. ఒక్క ఈ ఏకాదశి మూడు కోట్ల ఏకాదశిలతో సమానమైన పవిత్రతను సంతరించుకున్నందున దీన్ని ముక్కోటి ఏకాదశి అని అంటారు. ఈ ముక్కోటి ఏకాదశి నాటే హాలాహలం అమృతం రెండూ పుట్టాయి. ఈరోజునే పరమశివుడు ఆలహాలను మింగాడట.

తిథులలో పదకొండవ తిథి ఏకాదశి తిథులన్నింటిలోనూ ఈ తిథికి ప్రత్యేకత, ప్రాముఖ్యత ఉన్నాయి. శ్రీ మహావిష్ణువుకు ఏకాదశి ప్రీతికరమైనది. ప్రతి నెలా రెండు ఏకాదశులు వస్తాయి. సంవత్సరానికి ఇరవై నాలుగు ఏకాదశు లు వస్తాయి. అయితే చాంద్రమాన ప్రకారంగా మూడు సంవత్సరాలకు ఒకసారి అధిక మాసం వస్తుంది. అధికమాసం ఏర్పడి నప్పుడు ఆ సంవత్సరంలో ఇరవై ఆరు ఏకాదశులు వస్తాయి. ఏకాదశి తిథిని వైకుంఠ దినం, హరి దినం అని చెప్తారు. తొలి ఏకాదశి రోజున, వైకుంఠ ఏకాదశి రోజున ఆ శ్రీహరిని పూజిస్తూ పండుగలు జరుపుతాం, ప్రతి సంవత్సరం మార్గశిర మాసం, శుక్ల పక్ష ఏకాదశి రోజున "వైకుంఠ ఏకాదశి" ని జరుపుతారు. దీన్నే ముక్కోటి ఏకాదశి అని కూడా అంటారు. శ్రీ మహావిష్ణువు వైకుంఠ ఏకాదశి రోజున సర్వాలంకారభూషితుడై దేవేరులైన శ్రీదేవి, భూదేవి సమేతం గా గరుడ వాహనం అధిరోహించి వైకుంఠానికి వస్తాడు. అంతకు మునుపు ఆషాఢ శుద్ధ ఏకాదశి వాడు పాలకడలిలో ఆదిశేషుని శయ్యగా చేసుకుని యోగ నిద్రకు ఉపక్రమిస్తాడు. కార్తిక శుద్ధ ఏకాదశి నాడు యోగనిద్ర నుంచి మేల్కొం టాడు. ఆ తర్వాత వైకుంఠ ఏకాదశి నాడు, వైకుంఠానికి చేరుకుంటాడు. శ్రీమహావిష్ణువు వైకుంఠానికి ప్రవేశం చబోయే ముందు ఉత్తర ద్వారం వద్ద సమస్త దేవతలు ఆయనను దర్శించు కుని ఆయనను స్తుతిస్తూ నామ పారాయణ, భజనలు చేస్తూ ఆయన ను వైకుంఠంలోకి స్వాగతిస్తూ సేవ చేసుకుంటారు. వైకుంఠ ఏకాదశినాడు అన్ని ఆలయాల్లోనూ ముఖ్యంగా వైష్ణవాలయాల్లో ఉత్తర ద్వారాన్ని తెరుస్తారు. ఆరోజు తెల్లవారుజామునే స్వామి వారు ఉత్తర ద్వారంలోకి వస్తారు. భక్తులందరూ తెల్లవారుజామునే స్నానాదికాలు చేసి శుచిగా స్వామి వారి ఉత్తర ద్వార దర్శనానికి వచ్చి, అస్వామిని దర్శించుకుంటారు. ఉత్తర ద్వారంలో భగవంతుని దర్శించడం తో సర్వపాపాలు హరించిపోతాయని భక్తుల ప్రగాఢ విశ్వాసం. 'మోక్షదాఏకాదశి' అని కూడా చెబు తారు, జలప్రళయం సంభవించి నప్పుడు శ్రీమహావిష్ణువు మర్రి ఆకుపైన బాలకృష్ణుని రూపంలో ఏకాదశి రోజున పవళించినట్లుగా పురాణ కథనం.

ఏకాదశి మహత్యం గురించి వివరించే కథలు పురాణాల్లో ఉన్నాయి. పూర్వం రుక్మాంగదుడు అనేరాజు ప్రజారంజకంగా పరిపాలించేవాడు. ఆయన పాలనలో ప్రజలు సుఖంగా జీవించేవారు. అన్యాయం, అధర్మం, అవినీతి, హింసలాంటివి ఏవీ లేకపోవడంతో భూలోకంలో పావులు ఉండేవారు కాదు. చిత్రగుప్తునికి పని లేక పోయింది. యమకింకరులు భూ లోకం నుంచి పాపులను తీసుకువచ్చే పని కూడా వారికి లేదు. నరక లోకంలో యమధర్మరాజు పాపులకు శిక్ష విధించే చర్యలు, ఆ అవకాశం ఆయనకు లభించడం లేదు. యమ లోక వాసులెవ్వరికీ పనులు లేక పోవడంతో విశ్రాంతి కాలాన్ని గడప సాగారు. అతీరిక సమయం వారం దరికీ బాధాకరమైంది. చిత్రగుప్తుడు, యమధర్మరాజు ఒక ఉపాయం ఆలోచించారు. వారిద్దరి ఆలోచన ప్రకారంగా రంధను మోహినీరూపంలో అత్యంత సౌందర్యవతిగా తీర్చిదిద్ది రుక్మాంగదుని వద్దకు పంపారు. వేటకు వెళు తున్న రుక్మాంగదుడు రంభను చూసి, ఆమె సౌందర్యానికి అబ్బురపడి ఆమెను తనను పెళ్ళాడమని కోరాడు. "ఏ సమయంలోనైనా నువ్వు నా మాటవింటూ నా వశంలో ఉంటే నిన్ను పెళ్ళాడతాను" అని షరతు పెట్టింది ఆ సుందరాంగి. ఆమె పట్ల మోహితుడైన అరాజు ఆమె మాటలకు అంగీకరించాడు. వారిద్దరూ దంపతులయ్యారు. ఒకరోజున రుక్మాంగదుడు వ్రతనిష్టలో ఉన్నప్పుడు తనతో సుఖించమని కోరింది రంభ. ఆమెకోరికను రుక్మాంగదుడు నిరాక రించడంతో తనకు అతను ఇచ్చిన మాటను గుర్తు చేసింది. అయిన ప్పటికీ రుక్మాంగదుడు ఆమె కోరికను తీర్చటానికి సిద్ధపడలేదు. అతని చేత పాపకార్యాన్ని చేయించటానికి ఇదియే తగిన సమయమని భావించి మాట తప్పినందుకు కుమారుని సంహరించమని కఠినంగా పలికింది. ఆ పని చేయటానికి ఉద్యుక్తుడయ్యాడు రుక్మాంగదుడు, రుక్మాంగదుని భక్తికి మెచ్చిన విష్ణుమూర్తి ప్రత్యక్షమై అతనికి మోక్షాన్ని ప్రసాదించాడు. ఏకాదశి రోజున ఉపవాస దీక్షను పాటించి విష్ణు భగవానుని పూజిం చిన వారికి అధికపుణ్యం లభిస్తుంది. మరొక పురాణ కథకూడా ఏకాదశి వ్రత మహత్యాన్ని తెలిపింది. పూర్వం కుంభుడనే పేరుగల రాక్షసుడు ఉండే వాడు. అతని కుమారుడు మృదు మన్యుడు. మృదుమన్యుడు శివుని గురించి కఠిన తపస్సు చేశాడు. అతని తపస్సుకు మెచ్చిన పరమేశ్వరుడు అతని ఎదుట ప్రత్యక్షమై వరం కోరుకోమన్నాడు. అప్పుడు అసురుడు ఈశ్వరునికి నమస్కరించి, ఆయనను స్తుతించి ఆ తర్వాత "స్త్రీల చేత, పురుషుల చేత తనకు మరణం ఏర్పడకూడదన్న' వరాన్ని కోరుకు న్నాడు. 'తథాస్తు' అనిపలికిన శివుడు అతనికి అయోనిజ అయిన స్త్రీ చేత మాత్రమే మరణం సంభవిస్తుందని తెలిపాడు. అయోనిజ జన్మించడం అసాధ్యమని భావించాడు మృదు మన్యుడు. తనకు శివుడు ప్రసాదిం చిన వరగర్వంతో ముల్లోకాలను జయించిఆలోకాలను ఆక్రమించాడు. ఇంద్రాది దేవతలందరూ తమ లోకాలనూ, తమ స్థానాలనూ వదలి ఆ రాక్షసునికి భయపడి ఒక వృక్షపు తొర్రలో దాక్కున్నారు. వారందరి ఒరిపిడికి ఒక కన్య ఆవిర్భవించింది. ఇంతలోనే దేవతలను వెతుకుతూ వచ్చిన మృదుమన్యుడు దేవతలు చెట్టు తొర్రలో దాక్కున్నారని గ్రహిం చాడు. వికటాట్టహాసం చేస్తూదేవతల పలాయనాన్ని అక్షేపిస్తూ వారిని వృక్షపు తొర్రలోంచి బయటకు రమ్మనమని అజ్ఞాపించాడతను. ఆ సమయంలో అయోనిజ అయిన కన్య ఆ వృక్షపు తొర్రలోంచి బయటకు వచ్చి అసురునితో పోరాడి సంహరించింది. ఆ రోజు ఏకాదశి అవటంవలన తమ పాపప్రక్షాళన కోసం ఏకాదశి రోజున శ్రీహరిని పూజించడం ఆరంభమైంది. శ్రీమహావిష్ణువు ఉండే గుహ ఎక్కడో లేదు దేహమే దేవాలయం అని శాస్త్ర నిర్ణయం. ప్రతి మానవ హృదయం గుహలోను పరమాత్మ ప్రకాశిస్తున్నాడు. అంత దగ్గరలో ఉన్న పరమాత్మను ఉద్దేశించి ఏకాదశి వ్రతాన్ని నియమముగా ఆచరించమంటే , ఉపవాసం ద్వారా ఏకాదశేంద్రీయాలను నిగ్రహించి పూజ జపం,ధ్యానం మొదలైన సాధనాల ద్వారా ఆచరించడం అని అర్థం. కళ్ళు, చెవులు మొదలైనవి పంచ జ్ఞానేంద్రియాలు. కాళ్లు,చేతులు మొదలైనవి పంచ కర్మేంద్రియాలు, మనస్సు అనే పదకొండు ఇంద్రియాల ద్వారానే మనం పాపాలు చేస్తాం ఆ పదకొండే అజ్ఞానానికి స్థానం అందుకే పదకొండు స్థానాల్లో ఉన్న అజ్ఞానానికి ప్రతినిధి అయినా మురాసురుణ్ణి జ్ఞానప్రధాయిని అయినా ఏకాదశి మాత్రమే సంహరించగలదు,అందుకే ఏకాదశి వ్రతాన్ని నిష్టగా ఆచరించినవారు జ్ఞానవంతులవుతారు. వైకుంఠ ద్వారం శ్రీరంగంలోని శ్రీ రంగసాథ స్వామి దేవాలయంలో వైకుంఠ ఏకాదశి ఉత్సవాలు 21 రోజులు జరుగుతాయి, దీనిలో మొదటి భాగాన్ని పాగల్ పట్టు అని రెండవ భాగాన్ని ఇతర పట్టు అని పిలుస్తారు. శ్రీ విష్ణువు అవతారమైన రంగనాథ స్వామిని ఆ రోజు వజ్రాలతో చేసిన వస్త్రాన్ని అలంకరించి వేయి స్తంభాల ప్రాంగణంలోనికి వైకుంఠ ద్వారం గుండా తీసుకొని వచ్చి అక్కడ భక్తులకు దర్శనమిస్తారు. ఈ ద్వారం గుండా వెళ్ళిన భక్తులు వైకుంఠం చేరుకుంటారని భక్తుల ప్రగాఢ విశ్వాసం.

తిరుపతిలోని శ్రీ వెంకటేశ్వర స్వామి వారి దేవాలయంలో కూడా ఇదే మాదిరిగా కాకుండా ముందు దైవదర్శనం తదానంతరం వైకుంఠ ద్వారం ద్వారా ప్రవేశానికి అనుమతిస్తారు.ఏకాదశికి ముందు రోజు,అంటే దశమినాటి రాత్రి ఏకాంత సేవానంతరం తర్వాత, తెల్లవారుజామున వైకుంఠ ఏకాదశి నాడు సుప్రభాతం మొదలుకొని మరునాడు అంటే ద్వాదశమినాటి రాత్రి ఏకాంత సేవ వరకు శ్రీవారి గర్భాలయానికి అనుకొని ఉన్న వైకుంఠ ద్వారాన్ని తెరచి ఉంచుతారు. ఈ రెండూ రోజులు భక్తులు శ్రీవారి దర్శనం తర్వాత ముక్కోటి ప్రదక్షిణ మార్గంలో వెళ్తారు.

ఏకాదశినాడు వైష్ణవాలయానికి వెళ్ళి భగవంతుని దర్శించాలి. శ్రీహరిని త్రికరణ శుద్ధిగా పూజించాలి. ఉపవాస దీక్షను పాటించాలి. రోజంతా ఉపవాసం చేసి, మర్నాడు ద్వాదశి ఘడియలు సమీపించక ముందే ఉపవాసాన్ని విరమించాలి.

భగవంతునికినైవేద్యంగా సమర్పిం చిన ఆహారాన్ని భుజించాలి. అలా చేయలేని వారు ఏకాదశి రోజున ఒక పూట పాలు, పండ్లు తీసుకుని ఉపవాస దీక్షను చేయవచ్చు. అది కూడా సాధ్యం కాకపోతే ఉప్పు లేని ఫలహారాన్ని స్వీకరించవచ్చు. అదీ చేత కాని స్థితిలో ఉన్నవారు ఒక్క పూట మాత్రమే ఆహారాన్ని తీసుకోవచ్చు. భక్తి, భగవంతుని పట్ల విశ్వాసం ప్రధానంగా భావించాలి. అలంకార ప్రియుడైన స్వామిని అదేకరకాలైన పుష్పాలతో చక్కగా అలంకరించి స్వామి ఆనందాన్ని కనులారా కాంచి తృప్తి పొందుదాం !!



" కావ్యసుధ "
'వాఙ్మయ భూషణ'
" సాహితీ శిరోమణి "
" కవన సాగర "
'ఆధ్యాత్మిక సాహిత్య సామ్రాట్'
" ఆధ్యాత్మిక సాహితీ వ్యాస భూషణ్ "
9247313488 :
హయత్ నగర్ :
హైదరాబాదు

# ఐక్యమవుదాం.. అన్ని రంగాల్లో.. ఎదుగుదాం!!

- యాదవ భీష్ముడు నర్తు నరేంద్రయాదవ్
- అంగరంగ వైభవంగా యాదవ వన సమారాధన
- జిల్లా నలుమూలల నుంచి భారీగా హాజరైన యాదవులు
- ఆకట్టుకున్న సాంస్కృతిక ప్రదర్శనలు, సంగిడీ పోటీలు





నవతరం -శ్రీకాకుళం

వెనుకబాటును పారదోలి ఐక్యంగా ముందుకు కదులుదామని, అన్ని రంగాల్లోనూ అవకాశాలను అందిపుచ్చుకుని ఎదుగుదామని, యాదవ భీష్ముడు నర్తు.నరేంద్రయాదవ్ పిలుపునిచ్చారు. జనాభా దామాషా ప్రాతిపదికన రాజకీయంగానూ ఉన్నత పదవులు అధిరోహించాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. అన్ని రాజకీయ పార్టీలు యాదవులకు ప్రాధాన్యతనివ్వాలని కోరారు. సిక్కోలు యాదవుల ఐక్యవేదిక, యాదవ విద్యావంతుల వేదిక ఆధ్వర్యంలో అంపోలు రోడ్డులోని వెలమ సంక్షేమ సంఘం స్థలంలో..ఆదివారం యాదవుల ఆత్మీయ కలయిక, వనసమారాధన కార్యక్రమాన్ని నిర్వహించారు. జిల్లా వ్యాప్తంగా లెక్కకు మిక్కిలిగా యాదవులు హాజరయ్యారు. అంతా ఒకరినొకరు పరస్పరం పలకరింపులు, ఆలింగనాలు చేసుకున్నారు. ఈ సందర్భంగా అక్కడ గంభీర వాతావరణం నెలకొంది. యాదవ మేధావులు, విద్యావంతులు, ఉపాధ్యాయులు, కుల పెద్దలు అంతా ఒకేతాటిపైకి వచ్చారు. జిల్లాలోని 30 మండలాల నుంచి యాదవులు తరలిరావటంతో ఆ ప్రాంతం కిక్కిరిసిపోయింది. ఈ సందర్భంగా నరేంద్రయాదవ్ మాట్లాడుతూ..ఇంత పెద్ద ఎత్తున యాదవ కుటుంబం హాజరు కావటం ఆనందంగా ఉందన్నారు. ఇదో గొప్ప వేదిక అని..మేధావులంతా ఒక్కటిగా కనిపిస్తుండడం భవిష్యత్తు ఎదుగుదలకు సంకేతమన్నారు. యాదవుల సమస్యలపై ఐక్యంగా ఉద్యమిద్దామని, ఆ పోరాటాలకు ముందుంటానని స్పష్టం చేశారు. యాదవ సంఘం విశాఖపట్నం జిల్లా అధ్యక్షుడు ఒమ్మి.సన్యాసిరావు, శ్రీకాకుళం జిల్లా పరిషత్ వైస్ చెర్‌పర్సన్ పాలిన.శ్రీనివాసరావు, మందస, పలాస ఎంపీపీలు ఉంగ సాయికృష్ణ, డొక్కరి దానయ్య, మందస మాజీ జడ్పీటీసీ సభ్యులు అందాల.శేషగిరిరావు, ఇచ్ఛాపురం మున్సిపల్ వైస్ చెర్‌పర్సన్ ఉలాల భారతీదివ్య, జనసేన ఇన్‌చార్జి దాసరి రాజు, గొర్రెలు, మేకల సంఘం జిల్లా అధ్యక్షులు కుజ్జ.తాతయ్య, కిల్లాన.భోజ్‌కుమార్, కిల్లాన ఫల్గుణరావు, కిల్లాన.మాధవరావు, ఈవీ సత్యనారాయణ, గొర్ల మల్లేశ్వరరావు, గొర్ల రమణమూర్తి, కులపెద్దలు గద్దెబోయిన కృష్ణారావు, కలగ.గోపాల్, కలగ.జగదీష్, గజ్జి.షణ్ముఖరావు, కొర్రాయి వాసుదేవరావు, దట్టి.అజయ్, సాలిన.లక్ష్మణమూర్తి, మురపాల ధర్మాయాదవ్, నర్తు.ప్రేమ్‌కుమార్, నర్తు.భానోజీ, మామిడి.శ్రీను, నర్తు.ధనంజయరావు, కూస.వెంకటరమణ, కొర్రాయి.శ్రీను, వంకల.విజయకుమారి, నర్తు.సోమేశ్వరరావు తదితరులు మాట్లాడుతూ..ఒకే వేదిక ద్వారా యాదవుల సమస్యలపై పోరాడుదామన్నారు. ఐక్యపోరాటాలే శరణ్యమని, ఆ దిశగా ప్రయత్నిద్దామని పిలుపునిచ్చారు. అంతకుముందు కులం కోసం కృషి చేసిన దివంగతుల కోసం సభ స్మరించుకుంది. వారి ఆత్మశాంతికి రెండు నిమిషాలు మౌనం పాటించింది. వనసమారాధన నేపథ్యంలో నిర్వహించిన సంగిడీ పోటీలు ఆకట్టుకున్నాయి. చిన్నారుల కోలాటం నృత్య ప్రదర్శన, తప్పెటగుళ్లు, అంజాట వంటి సాంస్కృతిక ప్రదర్శనలు కట్టిపడేశాయి. రోజంతా సందడిగా గడిచింది. ఈ కార్యక్రమంలో జన్నెల.సంతోష్, సాలిన.గణేష్, నర్తు.నారాయణ, వంజరాపు.ధనంజయ, కొర్రాయి విమల్ యాదవ్, గజ్జి.నేతాజీ యాదవ్, కరగాన.షణ్ముఖరావు, రైల్వే ఉద్యోగి ధనంజయరావుతో పాటు పెద్ద ఎత్తున యాదవ కుటుంబాలు పాల్గొన్నాయి.

# కవి, జర్నలిస్ట్ ధర్మారావుకు 'శ్రమ' అవార్డు

మొదటిపేజీ తరువాయి

ఉభయ తెలుగు రాష్ట్రాల్లో ప్రముఖ ప్రజా కవుల్లో ఒకరిగా గుర్తింపు పొంది, గుర్రం జాషువా అవార్డు వంటి ప్రతిష్టాకరమైన కొన్ని అవార్డులు ధర్మారావు లభించాయి. ఉత్తమ జర్నలిస్టుగాను ఆయనకి అవార్డులు వచ్చాయి. కవి, రచయితగా నాలుగు దశాబ్దాలకు పైగా ఆయన ప్రజల పక్షాన కవితలు, పాటలు రచిస్తున్నారు. కళింగాంధ్ర సమస్యలు, ఆవేదనలపై జర్నలిస్టుగా వ్యాసాలు రాస్తున్నారు. తుది శ్వాస వరకు తన కృషి ఈ మార్గంలోనే కొనసాగుతుందని అవార్డు తీసుకున్న తర్వాత, అదే వేదికపై ధర్మారావు ప్రకటించారు.మాజీ ఎమ్మెల్సీ ఎంవిఎస్ శర్మ అవార్డును ప్రధానం చేశారు. ఈ కార్యక్రమంలో కళింగాంధ్రకు చెందిన ప్రముఖ కవులు, రచయితలు, గాయకులు పాల్గొన్నారు. ధర్మారావు కూడా తను రచించిన కొన్ని పాటలు ఆలపించారు. ఆయనకు ప్రతిష్టాత్మకమైన అవార్డు లభించినందుకు జర్నలిస్టులుగా తమకు చాలా ఆనందంగా ఉందని విశాఖ, ఆంధ్రజ్యోతి బ్యూరో చీఫ్ ఆదినారాయణ, శ్రీకాకుళం జిల్లా సీనియర్ నాయకులు ఎన్ ఈశ్వరరావు, కార్యక్రమానికి హాజరైన వివిధ పత్రికల ప్రతినిధులు హర్షం వ్యక్తం చేశారు. కార్యక్రమానికి హాజరైన ప్రజా సంఘాల సీనియర్ నాయకులు, న్యాయవాది బొడ్డేపల్లి మోహనరావు కూడా, ఆనందం వ్యక్తం చేశారు.

## జర్నలిస్టు సంఘాల హర్షం

కవి, జర్నలిస్ట్ నాయకులు నల్లి ధర్మారావుకు ప్రతిష్టాత్మకమైన' శ్రమ ' అవార్డు లభించినందుకు ఐజేయు జాతీయ కౌన్సిల్ సభ్యులు డి. మహారాణా, ఏపీయూడబ్ల్యూజే రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు బెండి నర్సింగరావు, జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు సిహెచ్ జగదీష్, సనపల రమేష్, స్నామ్నా రాష్ట్ర కార్యవర్గ సభ్యులు ఎంవి మల్లేశ్వరరావు.గరిమెళ్ళ ప్రెస్ క్లబ్ కార్యదర్శి ఎస్. నవచైతన్య, కోశాధికారి చౌదరి సత్యనారాయణ, ఎలక్ట్రానిక్ మీడియా జర్నలిస్టుల అసోసియేషన్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు బాలకృష్ణ,వాసు ఒక ప్రకటనలో హర్షం వ్యక్తం చేశారు.

# వైకుంఠ ఏకాదశి సందర్భంగా భక్తులకు సులభతర దర్శనం కల్పించాలి

(నవతరం -శ్రీకాకుళం

వైకుంఠ ఏకాదశి వంటి అత్యంత పవిత్రమైన పర్వదినాన్ని పురస్కరించుకొని వైష్ణవ దేవాలయాలకు లక్షలాది భక్తులు తరలివచ్చే అవకాశమున్న నేపథ్యంలో భక్తులకు ఎలాంటి అసౌకర్యాలు కలగకుండా సమగ్ర ఏర్పాట్లు చేయాలని  రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు జిల్లా అధికారులను సోమవారం ఆదేశించారు. భక్తులు ఉత్తర ద్వార దర్శనాన్ని సాఫీగా, సులభంగా చేసుకునేలా ప్రత్యేక చర్యలు తీసుకోవాలని సూచించారు. క్యూలైన్ల పకడ్బందీ నిర్వహణ, తాగునీటి సౌకర్యాలు, వైద్య సేవలు, ట్రాఫిక్ నియంత్రణ వంటి అంశాలపై ప్రత్యేక దృష్టి సారించాలని తెలిపారు. ఎక్కడా తోపులాటలు జరగకుండా పటిష్టమైన భద్రతా ఏర్పాట్లు చేయాలని, భక్తుల ప్రాణ భద్రతే అత్యంత ముఖ్యమని స్పష్టం చేశారు. పోలీస్, రెవెన్యూ శాఖలతో పాటు దేవాదాయ శాఖ, మున్సిపల్ అధికారులు సహా అన్ని సంబంధిత శాఖలు సమన్వయంతో పనిచేసి, భక్తులకు ప్రశాంతమైన, భక్తి భావంతో కూడిన దర్శన అనుభూతి కల్పించాలని మంత్రి స్పష్టమైన ఆదేశాలు జారీ చేశారు.

# 22 ఏళ్లకే బ్యాంక్ డెప్యూటీ మేనేజర్

- బాలికల కలలకు చిరునామా కేజీబీవీ!
- గ్రామీణ బాలికల కలలకు నిదర్శనంగా నిలిచిన కేజీబీవీ విద్యార్థిని విజయం
- పొన్నాడ కేజీబీవీ నుంచి గచ్చిబౌలి బ్యాంక్ అధికారి స్థాయికి జ్యోతిర్మయి ప్రస్థానం
- తల్లిదండ్రులుగురువుల ప్రోత్సాహంతో ఉన్నత ఉద్యోగం సాధించిన యువతి
- కేజీబీవీలు భవితకు భరోసా అనే నినాదాన్ని నిజం చేసిన జ్యోతిర్మయి
- కేజీబీవీ నుంచి బ్యాంక్ డెప్యూటీ మేనేజర్ వరకు స్ఫూర్తిదాయక ప్రయాణం

(నవతరం శ్రీకాకుళం)



గ్రామీణ ప్రాంతంలో ఉన్న కేజీబీవీ పాఠశాల నుంచే చదువు మొదలుపెట్టి, అంకితభావం ఆత్మవిశ్వాసంతో ముందుకు సాగిన జ్యోతిర్మయి కేవలం 22 ఏళ్ల వయసులోనే ఐసీఐసీఐ బ్యాంకులో డెప్యూటీ మేనేజర్‌గా నియామకం పొందింది. పొన్నాడ కేజీబీవీ విద్యార్థినిగా ప్రారంభమైన ఈ ప్రయాణం, చదువు ఉంటే అవకాశాలు తానే వెతుక్కుంటూ వస్తాయన్న సత్యాన్ని నిరూపిస్తూ, గ్రామీణ బాలికల కలలకు కొత్త ధైర్యం నింపుతోంది.ఎచ్చెర్ల మండలం పొన్నాడ కస్తూర్బా గాంధీ బాలికా విద్యాలయం పూర్వ విద్యార్థిని ముద్దాడ జ్యోతిర్మయి చిన్న వయసులోనే అరుదైన ఘన విజయాన్ని సాధించింది. కేవలం 22 ఏళ్ల వయసులోనే ప్రముఖ ఐసీఐసీఐ బ్యాంకులో డెప్యూటీ మేనేజర్ గ్రేడ్1గా నియామకం పొందుతూ ఎందరికో ఆదర్శంగా నిలిచింది. హైదరాబాద్ గచ్చిబౌలి ప్రధాన శాఖలో ఆమె అధికారిక బాధ్యతలను స్వీకరించారు.ఎనిమిదో తరగతి నుంచి పదో తరగతి వరకు పొన్నాడ కేజీబీవీలో విద్యాభ్యాసం చేసిన జ్యోతిర్మయి, అనంతరం విశాఖపట్నంలోని ఎన్.ఆర్.ఐ జూనియర్ కళాశాలలో ఇంటర్మీడియట్ (ఎంపీసీ) పూర్తి చేశారు. తిరుపతిలోని పద్మావతి మహిళా విశ్వవిద్యాలయంలో బీటెక్ పూర్తి చేసి ప్రతిభతో ముందుకు సాగారు. గ్రామీణ నేపథ్యం నుంచి జాతీయ స్థాయి బ్యాంకు అధికారిణిగా ఎదగడం ఆమె అంకితభావానికి నిదర్శనంగా నిలుస్తోంది.శ్రీకాకుళం రూరల్ మండలం కిల్లిపాలెం గ్రామానికి చెందిన జ్యోతిర్మయి తన విజయానికి తల్లిదండ్రుల ప్రోత్సాహమే ప్రధాన కారణమని తెలిపారు. తల్లి లలితారెడ్డి ప్రస్తుతం జి.సిగడాం కేజీబీవీలో తెలుగు ఉపాధ్యాయినిగా పనిచేస్తుండగా, తండ్రి రామారావు అందించిన ధైర్యం తనకు ఎల్లప్పుడూ బలంగా నిలిచిందని ఆమె పేర్కొన్నారు.తన గురువుల మార్గదర్శకత్వం జీవిత దిశను మార్చిందని జ్యోతిర్మయి గుర్తు చేస్తూ, కేజీబీవీ విద్యాలయాలు నిజంగా బాలికల భవిష్యత్తుకు భరోసా ఇస్తాయని తన విజయం ద్వారా నిరూపించానని చెప్పారు. చదరంగం ఆడటం, పుస్తకాలు చదవటం, కవితలు రాయటం ఆమెకు ఇష్టమైన హాబీలు.జ్యోతిర్మయి సాధించిన ఈ ఘన విజయం కేజీబీవీ విద్యార్థినులకు మాత్రమే కాకుండా, గ్రామీణ ప్రాంత బాలికలందరికీ స్ఫూర్తిగా నిలుస్తోంది. కుటుంబ సభ్యులు, ఉపాధ్యాయులు, గ్రామస్తులు ఆమెను ఘనంగా అభినందిస్తూ గర్వం వ్యక్తం చేశారు.



# శ్రీ భం సాయి సేవా ట్రస్ట్ ఆధ్వర్యంలో పోలయ్య కవి కూకట్లపల్లికి ఘన సన్మానం

నవతరం-హైదరాబాద్

బాగ్ లింగంపల్లిపుచ్చలపల్లి సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో ఆదివారం ఉదయం (తేది 28.12.2025 ) శ్రీ మహర్షి వాల్మీకి సాంస్కృతిక సేవా సంస్థ గౌరవాధ్యక్షులు పూర్వ మైన్స్ డైరెక్టర్ డా.వి.డి రాజగోపాల్ అధ్యక్షతన కళారత్న డా.బిక్కికృష్ణ వ్రాసిన "సాయి తత్వం - లీలా రహస్యం" పుస్తకావిష్కరణ ముఖ్యఅతిథిగా హాజరైన పూర్వ ఇన్కమ్ టాక్స్ కమిషనర్ యం.నరసింహప్ప చేతుల మీదుగా ఘనంగా జరిగింది.డాక్టర్ రాధా కుసుమ పద్మశ్రీలత సంక్షిప్త సుందరంగా పుస్తకాన్ని సమీక్షించారు.ఈ సందర్భంగా డా.రాధా కుసుమ సమన్వయకర్తగా నిర్వహించిన కవి సమ్మేళనంలో  హైదరాబాద్ అత్తాపూర్‌నివాసి ప్రముఖ కవి రచయితపోలయ్య కూకట్లపల్లి పాల్గొని """కళారత్న డా. బిక్కీకృష్ణ అంటే" శీర్షికన..."సభాసామ్రాట్ కళారత్నుడా. బిక్కికృష్ణ గారంటే..?ఒక సాహితీ శిఖరం...సాహిత్య రత్నాభరణం...సాయిభక్తి స్ఫూర్తి మంత్రం...మాటల మాంత్రికుడు...ఆలోచనల తాంత్రికుడు...భావాల మాయాజాలుడు... వారు...శ్రామిక కార్మికకర్షక వర్గ పక్షపాతి...సాహిత్య గగనంలోపగలు వెలిగే కవిసూర్యుడు...రాత్రి మెరిసే ఓ అక్షర నక్షత్రం...కమ్మని కవితల పందిరినల్లుతారు... పదాల పరిమళాన్ని వెదజల్లుతారు...బిక్కీకృష్ణ గారంటే..?నాలుగు దిక్కుల్లోఉదయించే కవి సూర్యుడువీరి కవిత్వం ఉప్పొంగే తరంగంఊహకందని గంభీరమైన భావాలువారి శైలి సుందరం...ప్రతీకలుఅపురూపం అద్వితీయం అమోఘం... బిక్కీగారి కవితలన్నీ అగాధమౌజలనిధిలో దాగి మెరిసే ఆణిముత్యాలే... కవిత్వమే తన ఊపిరిగా కవులను గుర్తించి ప్రోత్సహించడం... సన్మానించడంభుజం తట్టడం..ముందుకు నెట్టడం...బిక్కీకృష్ణగారి ఇష్టదైవమైన శ్రీసాయిభక్తిభావనకు ప్రేమతత్వానికి ప్రతిరూపం త్యాగగుణానికి నిలువెత్తు నిదర్శనంఅదే వారి జీవిత అంతిమ లక్ష్యంవారి కలం నుండి జాలువారినచరమగీతం మార్మిక నది కవిత్వం డిక్షన్‌ప్రతి గ్రంథం ఒక పెద్ద బాలశిక్ష...కవులకు ఒక కల్పవృక్షం...పరిమళించే ఓ పూలవనం...విద్యార్థులకు ఓ జీవన పాఠశాల...వారు ప్రవహించే ఓ సజీవ నది...వారు బృహత్ గ్రంథాల సృష్టి కర్త...వారి కవిత్వం ఓ గంగా ప్రవాహం...వారు ఈతరం కవులకు దొరికిన ఒక వరంఆ కళా తపస్వికి...ఆ అభినవ రాయలుకు...ఆ సాహితీ బ్రహ్మకిదే నా అక్షర హారతి"...అంటూ కమ్మని కవితను గానం చేసి గురుదేవులు శ్రీ బిక్కికృష్ణ గారి ప్రశంసలు ప్రముఖుల ఆశిస్సులు అందుకున్నారుతదనంతరం డా. యం.నరసింహప్పడా. వి.డి రాజగోపాల్ డా. బిక్కి కృష్ణపోలయ్య కవి కూకట్లపల్లిని ఘనంగా సన్మానించారు.ఈ సభకు ఆత్మీయ అతిథులుగా మారెళ్ళరాజరాజేశ్వరి వనపర్తి ధనలక్ష్మి లక్కరాజు తదితరులు హాజరై ప్రసంగించారు.సాహితీ మూర్తులు ముగ్గురుఈ సభలో కవితా గానం చేసిన కవులను కవయిత్రులను సాదరంగా సన్మానించారు



# కృతజ్ఞతలు తెలిపిన రైతు సంఘాలు

(నవతరం శ్రీకాకుళం)

పలాస నియోజకవర్గంలో వంశధార కాలువ ద్వారా శివారు ప్రాంతాలకు సాగునీరు అందించినందుకు రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు, స్థానిక శాసన సభ్యులు గౌతు శిరీష, జిల్లా కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ లకు సాగునీటి సంఘాల అధ్యక్షులు నిరంజన్ సోమవారం కృతజ్ఞతలు తెలిపారు. పలాస నియోజక వర్గంలో వంశధార కాలువ ద్వారా గతంలో శివారు ప్రాంతాలకు సాగునీరు అందక పంటలు పండేవి కాదని, రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కింజరాపు, స్థానిక శాసన సభ్యులు గౌతు శిరీష చొరవతో శివారు ప్రాంతాలకు సాగునీరు పంట భూములకు చేరి పంటలు బాగా పండినట్లు సాగునీటి సంఘాల అధ్యక్షులు కలెక్టర్ కు వివరించారు. జిల్లా కలెక్టర్ సమయ స్ఫూర్తితో ఎప్పటికప్పుడు నీటి పారుదల శాఖ అధికారులు మాట్లాడి కాలువ పనులు సకాలంలో పూర్తి చేసి సాగునీరు పంట పొలాలకు సాగునీరు అందించినందుకు జిల్లా కలెక్టర్ సాగునీటి సంఘాల అధ్యక్షులు, సభ్యులు నగరనపల్లి, కవిటి, లక్ష్మీపురం, మర్రిపాడు, తదితర చెందిన సభ్యులు కృతజ్ఞతలు తెలియజేస్తూ ఈ యేడాది పంటలు బాగా పండినందుకు ఆనందం వ్యక్తం చేశారు.



## యువత మేదస్సుకు పదును పెట్టేవే
# సిక్కోలు లఘు చిత్రోత్సవాలు....

### కేంద్ర విమానయాన శాఖ మాత్యులు కింజరాపు రామ్ మనోహర్ నాయుడు







**నవతరం-శ్రీకాకుళం**

ఆదివారం నాడు 28.12.2025 శ్రీకాకుళం పట్టణం, శ్రీకాకుళం రూరల్ మండలం అభివృద్ధి అధికారి కార్యాలయం ఆవరణలో సిక్కోలు లఘు చిత్రోత్సవం 2025 లోగో ఆవిష్కరణ కేంద్ర విమానయాన మంత్రివర్యులు కింజరాపు రామ్మోహన్ నాయుడు చేతుల మీదగా ఘనంగా జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ షార్ట్ ఫిలిం ఫెస్టివల్ యువత మేధస్సుని వెలికి తీసే ప్రయత్నంలో భాగమని దీని ద్వారా టాలెంట్ వ్యక్తం అవుతుందని అన్నారు. ఇది శ్రీకాకుళం జిల్లాలో ఎంసీఏ మరియు పీకే టీం ఆధ్వర్యంలో నిర్వహించడం హర్షనీయమని అన్నారు. ఈ సందర్భంగా శ్రీకాకుళం నియోజకవర్గ ఎమ్మెల్యే గొండు శంకర్ మాట్లాడుతూ షార్ట్ ఫిలిం ఫెస్టివల్స్ శ్రీకాకుళంలో నిర్వహించడం పలువురు నటులు డైరెక్టర్స్ రచయితలకు ప్రోత్సహించే దిశలో మీరు చేస్తున్న ప్రయత్నాలు అభినందనీయమని అన్నారు.

ఈ కార్యక్రమంలో ఎంసీఏ వ్యవస్థాపక అధ్యక్షులు మణిపాత్రుని నాగేశ్వరరావు, కార్యదర్శి తిరుమల రావు, పీకే టీం ప్రసాదు, కీర్తి, రామకృష్ణ, రాము, మాదారపు వెంకటేశ్వరరావు, ఎస్ వి రమణ మాదిగ, తెలుగు యువత విశ్వేశ్వరరావు, డిప్యూటీ ఎంపీడీవో కనితి సూర్యనారాయణ ఏలియన్స్ క్లబ్ మెంబర్స్ జామి మన్మధరావు తదితరులు పాల్గొన్నారు.

# ఖాదీ పరిశ్రమకు ఎల్లవేళల అండగా నిలుస్తాను

### -కేంద్ర మంత్రి హామీ



**నవతరం-శ్రీకాకుళం**

పొందూరులోని ఆంధ్ర సన్నఖాదీ కార్మికాభివృద్ధి సంస్థ ప్రగతికి, పురోగతికి అండగా ఉంటామని కేంద్ర పౌర విమానయాన శాఖ మంత్రి కింజరాపు రామ్మోహన్ నాయుడు హామీ నిచ్చారు.శ్రీకాకుళంలోని మంత్రి కేంపు కార్యాలయంలో తనను కలుసుకున్న పొందూరు ఖాదీ సంస్థ పాలకవర్గ ప్రతినిధులకు పై విధంగా స్పష్టం చేశారు.ఖాదీ సంస్థకు భౌగోళిక గుర్తింపు(జి. ఐ) రావడానికి తానొక్కడినేకాదు మీ అందరి సంయుక్త సహకారంతో సుసాధ్యమైందని ఆయన పేర్కొన్నారు.తాను సాధ్యమైనంత త్వరలోనే ఖాదీ సంస్థను సందర్శించగలనని పేర్కొన్నారు.ఖాదీ సంస్థ శాశ్వత భవన నిర్మాణానికి అప్పట్లో సర్వోదయ నాయకుడు ఆచార్య వినోబాభావే శంకుస్థాపన చేశారని,దీన్ని నిర్మించి 75ఏళ్లు పూర్తయిందని, శిథిలావస్థకు చేరుకుందని, దీనికి పునర్నిర్మాణం చేపట్టాలని ప్రతినిథివర్గం విన్నవించింది.గతంలో కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ ఇక్కడికి వచ్చినప్పుడు ఇదే విషయాన్ని ఆమె దృష్టికి తెచ్చిన విషయాన్ని గుర్తు చేశారు.అలాగే కార్మికులకు ఉచితంగా పరికరాలను అందించేందుకు చర్యలు తీసుకోవాలని పాలకవర్గం కోరింది.కేంద్ర మంత్రి రామ్మోహననాయుడు స్పందిస్తూ పొందూరు ఖాదీని సొంత విషయంగా భావిస్తున్నామని,దీని సర్వతోముఖాభివృద్ధికి అహర్నిశలూ పనిచేయగలమని హామీ నిచ్చారు.ఈ ప్రతినిధి వర్గంలో ఖాదీ సంస్థ అధ్యక్ష, కార్యదర్శులు, ఉపాధ్యక్షులు జి.కె.ప్రసాద్, డి.వి.రమణ,కొండమటి కొండలరావు, అలాగే తె.దే.పా ప్రతినిధులు దండా రవికుమార్, అనకాపల్లి శ్రీరంగనాయకులు తదితరులున్నారు. ఈ సందర్భంగా కేంద్ర మంత్రి రామ్మోహననాయుడుకు ఖాదీ పాలకవర్గ ప్రతినిధులు ధన్యవాదాలు తెలియజేస్తూ నూతన వస్త్రాలతో ఘనంగా సత్కరించారు.

# గచ్చిబౌలిలో 7000 మందితో కూచిపూడి మహోత్సవం

- గిన్నిస్ రికార్డు లక్ష్యంగా కూచిపూడి కళా వైభవం
- ఒకే వేదికపై వేల మంది చిన్నారుల నాట్య ప్రదర్శన
- అభినయ నృత్య నికేతన్ బృందంలో కీర్తి వేనిషా, గీతిక
- వెంపటి చినసత్యం పేరిట అవార్డులు అందుకున్న చిన్నారులు







**నవతరం-శ్రీకాకుళం**

హైదరాబాద్ గచ్చిబౌలి స్టేడియంలో గిన్నిస్ వరల్డ్ రికార్డు నమోదు లక్ష్యంగా నిర్వహించిన కూచిపూడి కళా వైభవం2 కార్యక్రమం ఘనంగా జరిగింది. సంప్రదాయ నృత్యానికి ప్రపంచ స్థాయి గుర్తింపు తీసుకురావాలనే లక్ష్యంతో ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు.ఈ వేడుకలో 7000 మంది చిన్నారులు ఒకే వేదికపై కూచిపూడి నాట్యాన్ని ప్రదర్శించి ప్రేక్షకులను విశేషంగా ఆకట్టుకున్నారు. శాస్త్రీయ నాట్య శైలిలో వారి సమన్వయ ప్రదర్శన ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది.ఈ కార్యక్రమంలో శ్రీమతి తిమ్మరాజు నీరజా సుబ్రహ్మణ్యం అభినయ నృత్య నికేతన్ బృందం నుంచి చిన్నారులు కీర్తి వేనిషా, గీతిక పాల్గొని తమ ప్రతిభను చాటుకున్నారు. నాట్యాచార్య వెంపటి చినసత్యం పేరిట ఏర్పాటు చేసిన అవార్డులను చిన్నారులు అందుకున్నారు. అలాగే గ్లోబల్ బుక్ ఆఫ్ ఎక్సెన్స్ మినిస్టర్ మనీష్ కుమార్ చేతుల మీదుగా అవార్డులు ప్రదానం చేశారు. ఈ కార్యక్రమం ద్వారా కూచిపూడి నాట్యానికి అంతర్జాతీయ స్థాయిలో మరింత గుర్తింపు లభించనుందని నిర్వాహకులు తెలిపారు.

# జర్నలిస్ట్ తలగాపు కి జన్మదిన శుభాకాంక్షలు తెలిపిన చైర్మన్ బల్ల గిరిబాబు



**నవతరం-పలాస**

సీనియర్ జర్నలిస్ట్ తలగాపు వెంకటరమణ పుట్టినరోజు సందర్భంగా పలాస - కాశీబుగ్గ పురపాలక సంఘం చైర్మన్ బల్ల గిరిబాబు ఆయనకు శుభాకాంక్షలు తెలిపారు. సోమవారం స్థానిక మున్సిపల్ కార్యాలయం చైర్ పర్సన్ ఛాంబర్‌లో జర్నలిస్ట్ తలగాపు వెంకటరమణ కు జన్మదిన శుభాకాంక్షలు తెలుపుతూ.. స్వీట్స్ తినిపించారు. ఈ సందర్భంగా చైర్మన్ బల్లగిరి మాట్లాడుతూ.. మూడు దశాబ్దాల నుంచి జర్నలిజం రంగంలో రాణిస్తూ, అనేక సామాజిక విశ్లేషణలతో కూడిన కథనాలు వివిధ పత్రికల ద్వారా పార్టీలకు అందించడమే కాకుండా, ఉన్నత విలువలు కలిగి ఉండడమే కాక, సామాజిక స్పృహతో అన్ని వర్గాల ప్రజలతో మమేకమవుతూ, క్షేత్రస్థాయిలో ప్రజలను చైతన్యపరిచే జర్నలిస్టుగా సేవలందిస్తూ..

పలాస నియోజకవర్గ అభివృద్ధికి తగు సూచనలు సలహాలు ఇస్తూ.. అందరివాడిగా అభిమానం చూరగొనడం విశేషం అన్నారు. జర్నలిస్టుగా, సామాజిక వేత్తగా అందరి మన్ననలు పొందిన తలగాపు వెంకటరమణ మరెన్నో పుట్టినరోజు వేడుకలు జరుపుకోవాలని బల్ల గిరిబాబు ఆకాంక్షించారు.

ఈ కార్యక్రమంలో పలాస ప్రెస్ క్లబ్ అధ్యక్షులు దేవ విశ్వేశ్వరరావు (నాని) ప్రముఖ విద్యావేత్త దానేటి కామేశ్వరరావు, దబ్బీరు నాగు, బడగల మధు, వల్లభ వైకుంఠ రావు, జర్నలిస్టు కె. చలపతిరావు తదితరులు పాల్గొన్నారు.


# హయాతినగరం బాలాజీ నగర్‌లో అంబేద్కర్ విగ్రహంపై దుండగుల దాడి

### నిందితుల్ని వెంటనే అరెస్ట్ చేయాలి

**నవతరం -శ్రీకాకుళం**

శ్రీకాకుళం నగరంలోని హయాతినగరం, బాలాజీ నగర్ ప్రాంతంలో భారత రాజ్యాంగ నిర్మాత డా. బీఆర్ అంబేద్కర్ విగ్రహంపై గుర్తుతెలియని దుండగులు అమానుషంగా దాడి చేశారు. అర్ధరాత్రి వేళ విగ్రహం వద్ద మూత్ర విసర్జన చేసి, విగ్రహం చేతిని విరగొట్టిన ఘటన స్థానికుల్లో తీవ్ర ఆగ్రహాన్ని రగిలించింది.ఈ ఘటన కేవలం ఒక విగ్రహంపై జరిగిన దాడి మాత్రమే కాకుండా భారత రాజ్యాంగం, దళితుల ఆత్మగౌరవం, సామాజిక సమానత్వంపై జరిగిన ప్రత్యక్ష దాడిగా పలువురు అభిప్రాయపడుతున్నారు. సమాజంలో శాంతిభద్రతలకు భంగం కలిగించే విధంగా ఈ దుశ్చర్యకు పాల్పడ్డారని స్థానికులు ఆరోపిస్తున్నారు. ఈ ఘటనపై స్పందించిన దాసరి తిరుమలరావు మాదిగ, ఈ దుశ్చర్యకు పాల్పడిన గుర్తుతెలియని వ్యక్తులను తక్షణమే గుర్తించి అరెస్ట్ చేయాలని డిమాండ్ చేశారు. పోలీసు శాఖ ప్రత్యేక బృందాన్ని ఏర్పాటు చేసి నిందితులను గుర్తించి కఠిన చర్యలు తీసుకోవాలని కోరారు.భారత రాజ్యాంగాన్ని కాపాడుకోవడం ప్రతి పౌరుడిపై ఉన్న బాధ్యత అని ఆయన తెలిపారు. డా. అంబేద్కర్ ఆశయాలకు విరుద్ధంగా జరిగే ఇలాంటి చర్యలను సమాజం సహించబోదని హెచ్చరించారు. భవిష్యత్తులో ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా ప్రభుత్వం, పోలీసు యంత్రాంగం కఠిన చర్యలు తీసుకోవాలని కోరారు.శ్రీకాకుళం జిల్లా ఎస్సీఎస్టీ విజిలెన్స్ మానిటరింగ్ కమిటీ (ఎంఎస్పీ) జిల్లా అధ్యక్షుడిగా, అలాగే ఎంఆర్‌పీఎస్ మాజీ జిల్లా అధ్యక్షుడిగా ఉన్న దాసరి తిరుమలరావు మాదిగ, నిందితులపై ఎస్సీ/ఎస్టీ అట్రాసిటీ చట్టం కింద కేసులు నమోదు చేసి కఠినంగా శిక్షించాలన్నారు.





Printed by **SIRIGIRI VARADARAJU**, and published by **SIRIGIRI VARADARAJU**, on behalf of **SIRIGIRI VARADARAJU**, and printed at : Kranthi Publications, D.No.2-504/1, **Aditya Nagar** Colony, **Arasavilli,** Srikakulam,Srikakulam dist. ANDHRA PRADESH STATE - 532 401, **Published at :** Kranthi Publications, D.No.2-504/1, Srikakulam dist. ANDHRA PRADESH STATE - 532 401, Editor : **SIRIGIRI VARADARAJU**, Email: navataramraju@gmail.com, **Cell : 9959007255, 8340844777**